అభివృద్ధి పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ దివాకర్

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ మంగళవారం డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న వరద నీటి పైపులైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. రాజధాని స్కూల్ నుంచి రూ. 6 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ డీఈఈ వసంత, ఏఈఈ ప్రవీణ్, ఇంజనీరింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు భాస్కర్, హరిత, ఆర్కె లే అవుట్ అసోసియేషన్ సభ్యులు, ఆంజనేయ వర్మ, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై తండ్రి లైంగిక వేధింపులు

జీడిమెట్ల: కన్న తండ్రి కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి (42) గత కొన్నాళ్లుగా తన కుమార్తె(15)ను లైంగికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో ఆమె బాధితురాలితో కలిసి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం



యాదమ్మ (ఫైల్)

నిజాంపేట్ : కుమార్తెను చూసేందుకు హాస్టల్‌కు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాచుపల్లి, ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న యెముల యాదమ్మ (37) ఈ నెల 3న తన కుమార్తె పవిత్రను కలిసేందుకు ప్రగతినగర్‌లోని ప్రగతి హాస్టల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరాలి

రాజీవ్ యువ వికాసం పథకంపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



సాక్షి,సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధి చేకూరేందుకు చర్యలు తీసుకోవాలని. ఇందుకు గాను ప్రతి దరఖాస్తును పరిశీలించాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలాలు, పురపాలక సంఘాల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు పరిశీలించిన వాటిపై ఆయన ఆరా తీశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను శ్రద్ధగా పరిశీలించాల్సిన అవశ్యకతను వివరించారు. ఎంపికైన దరఖాస్తుల సెలక్షన్ లిస్టులను వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పలువురు అధికారులు ,కమిషనర్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. అవసరమైన సలహాలను సూచనలు చేశారు. దరఖాస్తుల ఎంపిక ప్రక్రియలో పూర్తి బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టర్ గౌతమ్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్ కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి ఝాన్సీరాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, హౌజింగ్ ఈడీ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు త్రిలేశ్వర్‌రావు, వీరారెడ్డి, నాగిరెడ్డి, నాగమణి, వెంకట్‌గోపాల్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్వీ నాయక్, సాబేర్‌అలీ, శైలజ, చంద్రశేఖర్, ఎల్డీఎం, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మేమే ఉంటున్నాం..

నోటీసులకు వివరణ ఇచ్చేందుకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల క్యూ..



వివరణ ఇచ్చేందుకు బారులు తీరిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో అనర్హులు నివాసం ఉంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు గత 20 రోజులుగా నోటీసులు జారీ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి, గండిమైసమ్మ, కుత్బుల్లాపూర్ మండలాల్లో 13,084 డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించగా వాటిని 18 నెలల క్రితం పంపిణీ చేశారు. అప్పటి నుంచి తమకు కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారా లేదా అని తెలుసుకునేందుకు మండల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో గత రెండు రోజులుగా వివరణ ఇచ్చేందుకు క్యూ కడుతున్నారు. ఇళ్లను సొంతం చేసుకున్న తర్వాత ఇప్పటివరకు ఇళ్లలోకి వెళ్లని వారు సైతం తామే నివాసం ఉంటున్నట్లు చెప్పుకోవడం గమనార్హం.

కార్మికులను బానిసలుగా మార్చొద్దు

నిజాంపేట్ : నాలుగు లేబర్‌కోడ్స్ అమలు చేసి, కార్మికులను బానిసలుగా మార్చరాదని సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు ఉద్యోగులు మే 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారి సక్కుబాయికి మంగళవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని నీరుగార్చి 12 గంటల పని విధానాన్ని అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేషు, చిన్న నరసింహ, మన్యం, గురవయ్య, యాదగిరి, ఈశ్వరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి..



గజమాలతో సత్కరిస్తున్న హరికిరణ్ పటేల్, కిరణ్..

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లకు చెందిప కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనతో కేక్ కట్ చేయించి, గజమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, యువజన నాయకులు బొంగునూరి కిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, కార్పొరేషన్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, ఐఎన్‌టీయుసీ నాయకులు పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు..



కొలన్ హన్మంతరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగౌడ్..

పెద్దమ్మ తల్లి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో ఈ నెల 11 పెద్దమ్మ తల్లి విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బొడ్రాయి కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ స్థానిక కార్పొరేటర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తన వంతుగా రు. 21 వేలు విరాళంగా అందజేశారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

నిజాంపేట్ : ప్రగతినగర్ సుందరయ్య భవనంలో ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'చిరుమువ్వల సవ్వడులు' పేరుతో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సుందరయ్య భవన నిర్వహణ కమిటీ కన్వీనర్ సిహెచ్ఎం చారి తెలిపారు. మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన సాధనాల వెంకటస్వామి నాయుడు వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజికంగా, మానసికంగా ఎదగడానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రగతి కల్చరల్ అసోసియేషన్ కన్వీనర్ శంకరరావు, సమ్మర్‌క్యాంప్ ప్రోగ్రామ్ డైరెక్టర్ యాని, ప్రగతి మహిళా సాధికారిత వేదిక సభ్యులు రోజారాణి, నాగమణి, పావని, పల్లవి, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



కుత్బుల్లాపూర్: టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సుచిత్ర బ్రాంచ్ నారాయణ పాఠశాల విద్యార్థులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. వి.కీర్తిక 583, మోక్షిత 582, కృష్ణచైతన్య 581, కీర్తిరెడ్డి 581 మార్కులు సాధించగా 70 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ఏజీఎం పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో తమ విద్యార్థులు 99.2 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఇది సాధ్యపడిందన్నారు. అనంతరం విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమలత, అకాడమిక్ డీన్ సాయి ప్రకాష్, కో.ఆర్డినేటర్ కిరణ్, టెన్త్ క్లాస్ ఇన్‌చార్జి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం

జగద్గిరిగుట్ట: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంటికి నిప్పంటుకుని గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజీవ్ గృహకల్ప, బ్లాక్ నెంబర్ 13 ప్లాట్ నెంబర్ 24 లో వెంకన్న, అమీనా దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం వీరు ఓ శుభకార్యానికి వెళ్లారు. వీరు వెళ్లిన అరగంటలోపే స్థానికులు ఫోన్ చేసి ఇంట్లో నిప్పంటుకుని మంటలు వ్యాపిస్తున్నట్లు తెలిపారు. వారు తిరిగి వచ్చేసరికి ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్ తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.